చెన్నై X బెంగళూరు

మార్చి 22 నుంచి ఐపీఎల్ షురూ

తొలి విడత షెడ్యూల్ విడుదల చేసిన బీసీసీఐ

న్యూఢిల్లీ: అభిమానులంతా ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) షెడ్యూల్ విడుదలైంది. ముందే అనుకున్నట్లు వచ్చే నెల 22 నుంచి ఐపీఎల్ 17వ సీజన్ ప్రారంభం కానుంది. ప్రతి సీజన్‌లో గత ఫైనలిస్ట్‌ల మధ్య తొలి పోరు జరుగుతుండగా.. ఈ సారి మాత్రం అందుకు భిన్నంగా షెడ్యూల్ రూపొందించారు. మార్చి 22న డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్‌తో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు తొలి పోరులో తలపడనుంది. ఈ వేసవిలో సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో తొలి 17 రోజులకు సంబంధించిన షెడ్యూల్‌ను మాత్రమే విడుదల చేశారు. ఏప్రిల్ 7 వరకు జరిగే మొత్తం 21 మ్యాచ్‌లు 10 నగరాల్లో నిర్వహించనున్నారు. ఇందులో మూడు డబుల్ హెడర్స్ ఉన్నాయి. లోక్‌సభ ఎన్నికల్ షెడ్యూల్ అనంతరం తదుపరి మ్యాచ్‌ల వివరాలు వెల్లడించనున్నారు. తొలి విడుతలో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు విశాఖపట్నం హోం గ్రౌండ్‌గా ఉండనుంది. 'ఎన్నికల షెడ్యూల్ నేపథ్యంలో తొలి రెండు వారాల మ్యాచ్‌ల వేదికలను ప్రకటించాం. షెడ్యూల్ అనంతరం పూర్తి స్థాయి వివరాలు వెల్లడిస్తాం. ఎన్నికలతో క్లాష్ కాకుండా ఐపీఎల్ షెడ్యూల్ రూపొందిస్తాం' అని బీసీసీఐ ఒక ప్రకటనలో తెలిపింది. మొత్తం పది జట్లు రెండు గ్రూపుల్లో పోటీ పడనుండగా.. లీగ్ దశలో ఒక్కో జట్టు 14 మ్యాచ్‌లు ఆడనుంది.

హైదరాబాద్‌లో రెండు మ్యాచ్‌లు:

రానున్న ఐపీఎల్ సీజన్ తొలి షెడ్యూల్‌లో హైదరాబాద్ రెండు మ్యాచ్‌లకు ఆతిథ్యమివ్వనుంది. ఉప్పల్ స్టేడియం వేదికగా మార్చి 27న సన్‌రైజర్స్ హైదరాబాద్, ముంబై ఇండియన్స్ తొలి పోరు జరుగనుండగా, ఏప్రిల్ 5న చెన్నైతో మరో మ్యాచ్ ఉంది. హైదరాబాద్‌కు రెండు మ్యాచ్‌లు కేటాయించినందుకు బోర్డు కార్యదర్శి జైషాకు హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు కృతజ్ఞతలు తెలిపారు.

అమ్మాయిల పొట్టి పోరు

నేటి నుంచి డబ్ల్యూపీఎల్

తొలి పోరులో ముంబైతో ఢిల్లీ ఢీ

బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) రెండో సీజన్‌కు శుక్రవారం తెర లేవనుంది. డిఫెండింగ్ చాంపియన్ ముంబై ఇండియన్స్‌తో రన్నరప్ ఢిల్లీ క్యాపిటల్స్ తొలి మ్యాచ్‌లో తలపడనుంది. మొత్తం ఐదు జట్లు (ఢిల్లీ, గుజరాత్, ముంబై, బెంగళూరు, యూపీ) పాల్గొంటున్న ఈ లీగ్.. గ్రూప్ దశలో 20 మ్యాచ్‌లు జరగనున్నాయి. తొలి మ్యాచ్ రాత్రి 8 గంటలకు ప్రారంభం కానుండగా.. మిగిలిన మ్యాచ్‌లన్నీ 7.30 నుంచి మొదలవుతాయి. నిరుడు జరిగిన డబ్ల్యూపీఎల్ మంచి ప్రజాదరణ దక్కించుకోగా.. ఈ సారి బెంగళూరు, ఢిల్లీలో మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. గత డబ్ల్యూపీఎల్‌తో మెరిసిన వారిలో శ్రేయాంక పాటిల్, టిటాస్ సధు వంటి వాళ్లు ఇటీవల జాతీయ జట్టు తరపున అవకాశం దక్కించుకోగా.. ఈ సారి తమ వంతుకోసం యంగ్ ప్లేయర్స్ ఎదురుచూస్తున్నారు. టీమ్‌ఇండియా స్టార్లు హర్మన్‌ప్రీత్ కౌర్, స్మృతి మంధన, జెమీమా రోడ్రిగ్స్, షఫాలీ వర్మ, దీప్తి శర్మతో పాటు.. అంతరాతీయ స్టార్లు అలీసా హీలీ, లానింగ్, అమేలియా కెర్, మాత్యూస్, స్కీవర్, చమరీ ఆట పట్టు ఈ లీగ్‌లో భాగం కాబోతున్నారు.

రాంచీ రాజెవరో!

బుమ్రాకు విశ్రాంతి • ఉదయం 9.30 నుంచి స్పోర్ట్స్18లో

విరాట్ కోహ్లీ లేదు.. కేఎల్ రాహుల్ ఫిట్‌నెస్ సాధించలేదు!
పుజారా, రహానే ఊసే లేదు.. శ్రేయస్ లయ కోల్పోయాడు!!
గాయపడ్డ షమీని ఎంపికే చేయలేదు.. బుమ్రాకు విశ్రాంతినిచ్చారు!!!

అయినా.. ఇంగ్లండ్‌తో నాలుగో టెస్టులో టీమ్‌ఇండియా ఫేవరెట్‌గా బరిలోకి దిగుతుందంటే అందుకు ప్రధాన కారణం.. యువ ఆటగాళ్లు అవకాశాలను అందిపుచ్చుకోవడమే. ఓపెనర్ యశస్వి జైస్వాల్ రెండు ద్విశతకాలతో అదరగొడితే.. సర్ఫరాజ్ అరంగేట్ర టెస్టులోనే రెండు ఇన్నింగ్స్‌ల్లో అర్ధశతకాలతో ఆకట్టుకున్నాడు. ధ్రువ్ జురెల్ కూడా మంచి జోరు మీదుండగా.. గిల్ గాడినపడ్డాడు. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇప్పటికే 2-1తో ఆధిక్యంలో ఉన్న రోహిత్‌సేన.. రాంచీలోనే సిరీస్ పట్టేయాలని చూస్తుంటే.. సమం చేయాలని ఇంగ్లండ్ టీమ్ తహతహలాడుతున్నది. మరి ధోనీ సొంత ఇలాకాలో ఎవరి జెండా ఎగురుతుందో చూడాలి!

స్టోక్స్

రాంచీ: ఇటీవలి కాలంలో ఎప్పుడూ లేనంత బలహీన పేస్ బౌలింగ్ విభాగంతో భారత జట్టు టెస్టు మ్యాచ్‌కు సిద్ధమైంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా శుక్రవారం నుంచి భారత్, ఇంగ్లండ్ మధ్య నాలుగో టెస్టు ప్రారంభం కానుండగా.. షమీకి గాయం, బుమ్రాకు విశ్రాంతి కారణంగా సిరాజ్ పేస్ దళాన్ని నడిపించనుండగా.. కొత్త కుర్రాడు ఆకాశ్ దీప్ అరంగేట్రం చేసే చాన్స్ ఉంది. మరోవైపు 'బజ్‌బాల్' ఆట తీరు ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్క టెస్టు సిరీస్ కోల్పోని ఇంగ్లండ్‌కు రాంచీలో అసలు సిసలు పరీక్ష ఎదురుకానుంది. ఇప్పటి వరకు ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ దూకుడే మంత్రంగా చెలరేగిన ఇంగ్లిష్ జట్టు రాంచీ పిచ్‌ను చూసే తెగ తికమక పడుతున్నది. ఇక బరిలోకి దిగిన తర్వాత ఎలాంటి ప్రదర్శన చేస్తుందనేది చూడాలి. కోహ్లీ, రాహుల్, శ్రేయస్ వంటి వాళ్లు అందుబాటులో లేకున్నా.. ఈ సిరీస్‌లో యువ ఆటగాళ్లు దుమ్మురేపుతున్నారు. ముఖ్యంగా ఓపెనర్ యశస్వి జైస్వాల్ ఆడిన మూడు మ్యాచ్‌ల్లో రెండు డబుల్ సెంచరీలతో 545 పరుగులు చేసి పుల్ జోష్ మీదుండగా.. సర్ఫరాజ్ ఖాన్, శుభ్‌మన్ గిల్ టచ్‌లో ఉన్నారు. ఇక కెప్టెన్ రోహిత్ శర్మ జట్టుకు పెద్దన్నగా వ్యవహరిస్తుండగా.. అవసరమైతే బ్యాట్‌తోనూ సత్తాచాటేందుకు తాను సిద్ధమే అని జడేజా నిరూపిస్తున్నాడు. గత మూడు మ్యాచ్‌లకు భిన్నమైన పిచ్ రాంచీలో ఎదురు చూస్తుండగా.. టీమ్‌ఇండియా ముగ్గురు స్పిన్నర్లు ఇద్దరు పేసర్లతోనే బరిలోకి దిగనుంది. బుమ్రా స్థానాన్ని ఆకాశ్‌దీప్ భర్తీ చేసే అవకాశాలున్నాయి. మరోవైపు సిరీస్ సమం చేయాలని కృతనిశ్చయంతో ఉన్న ఇంగ్లండ్.. తుది జట్టులో రెండు మార్పులు చేసింది. మార్క్‌వుడ్ స్థానంలో ఒలీ రాబిన్‌సన్‌ను, రెహాన్ అహ్మద్ ప్లేస్‌లో షోయబ్ బషీర్‌కు చోటు కల్పించింది. బుమ్రా గైర్హాజరీతో ఇంగ్లండ్ మిడిలార్డర్ ఊపిరి పీల్చుకుంటుందనడంలో సందేహం లేదు. ముఖ్యంగా అతడి బౌలింగ్‌లో పదే పదే ఔట్ అవుతున్న ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ జో రూట్ ఈ మ్యాచ్‌లో సత్తాచాటుతాడా చూడాలి.

తుది జట్లు

ఇంగ్లండ్: స్టోక్స్ (కెప్టెన్), క్రాలీ, డకెట్, రూట్, బెయిర్‌స్టో, బషీర్, ఫోక్స్, హార్ట్‌లీ, పోప్, రాబిన్‌సన్, అండర్సన్.
భారత్ (అంచనా): రోహిత్ (కెప్టెన్), యశస్వి, గిల్, రజత్, సర్ఫరాజ్, ధ్రువ్, జడేజా, అశ్విన్, కుల్దీప్, సిరాజ్, ముఖేశ్/ఆకాశ్‌దీప్.

పిచ్, వాతావరణం

గత మూడు మ్యాచ్‌లు జరిగిన వేదికలతో పోల్చుకుంటే.. రాంచీ పిచ్ భిన్నంగా ఉండనుంది. స్పిన్‌కు సహకరించే అవకాశలెక్కువ. పిచ్‌పై పగుళ్లు ఉన్నాయి. మ్యాచ్‌కు వర్షం ముప్పు లేదు.

రోహిత్ శర్మ

నేటి నుంచి భారత్, ఇంగ్లండ్ నాలుగో టెస్టు

భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ ప్రస్తుతం జమ్మూ కశ్మీర్‌లో పర్యటిస్తున్నాడు. గురువారం బారాముల్లాలోని యురీలో సచిన్ సరదా కొద్ది సేపు క్రికెట్ ఆడాడు. అక్కడి స్థానిక యువతతో కలిసి ఆడిన సచిన్ వారిలో ఉత్సాహం నింపాడు.

4

టెస్టుల్లో 700 వికెట్ల మైలు రాయిని అందుకోవడానికి ఇంగ్లండ్ వెటరన్ పేసర్ అండర్సన్‌కు ఇంకా నాలుగు వికెట్లు కావాలి. మురళీధరన్ (800), వార్న్(708) ముందువరుసలో ఉన్నారు.

ఐపీఎల్‌కు షమీ దూరం!

న్యూఢిల్లీ: భారత సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ.. ఐపీఎల్‌కు దూరమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. చీలమండ గాయం కారణంగా చాన్నాళ్లుగా జట్టుకు దూరంగా ఉన్న 33 ఏండ్ల షమీ.. త్వరలోకాలికి శస్త్రచికిత్స చేయించుకోనున్నాడు. దీంతో వచ్చే నెల నుంచి ప్రారంభం కానున్న ఐపీఎల్‌లో అతడు అందుబాటులో ఉండటం కష్టమే అని బీసీసీఐ అధికారి తెలిపాడు. 'గత నెలలో లండన్ వెళ్లిన షమీ ప్రత్యేక వైద్యం చేయించుకున్నాడు. అయితే అది పెద్దగా ప్రభావం చూపలేదు. ఇప్పుడు శస్త్రచికిత్సే మార్గం. దీని కోసం అతడు యూకే వెళ్లనున్నాడు. అంటే ఐపీఎల్ అంశం చర్చకే రాదు' అని పేర్కొన్నాడు.

పారా అథ్లెట్స్ అదుర్స్

న్యూఢిల్లీ: ఏషియన్ పారా ట్రాక్ సైక్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత సైక్లిస్టులు అదరగొడుతున్నారు. ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియం వేదికగా గురువారం జరిగిన వేర్వేరు విభాగాల్లో భారత్‌కు రెండు స్వర్ణాలు సహా రజతం, కాంస్యం దక్కాయి. పారా సీ2 15కి.మీ స్క్రాచ్ ఫైనల్లో అర్షద్ షేక్ పసిడి పతకంతో మెరువగా, జలాలుద్దీన్ అన్సారీ రజతం కైవసం చేసుకున్నాడు. మహిళల సీ2 15కి.మీల స్క్రాచ్ రేసులో జ్యోతి స్వర్ణం ఖాతాలో వేసుకుంది. సీ3 క్లాస్ 15కి.మీ స్క్రాచ్ తుది పోరులో పవన్‌కుమార్ కాంస్యం దక్కించుకున్నాడు.

ఆసియా పవర్‌లిఫ్టింగ్ టోర్నీలో మనోళ్లు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హాంకాంగ్‌లో జరుగనున్న ఏషియన్ పవర్‌లిఫ్టింగ్ టోర్నీలో రాష్ట్ర లిఫ్టర్లు చోటు దక్కించుకున్నారు. రాష్ట్రం నుంచి వైష్ణవి (84కి), శ్రీచందన (52కి), స్వప్నిక (84+కి), ఉదయ్(83కి), రమేశ్ (83కి)ఎంపికయ్యారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.